ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట రూరల్ : ఎర్కారంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 30 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. మండల పరిధిలోని ఎర్కారం గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు, ఎగుమతులు, దిగుమతుల గురించి మేనేజర్ వెంకట్‌రెడ్డిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎర్కారం పీఏసీఎస్‌లో ఇప్పటివరకు 1,91,426 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు మేనేజర్ కలెక్టర్‌కు తెలిపారు. ధాన్యం త్వరితగతిన కొనుగోళ్లు చేస్తుండడంపై పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో 12,755 మంది రైతుల నుంచి 1,47,820 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.159 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సురేశ్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాల విషయంలో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు.అనంతరం కుంటపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. అదే గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వసతులను తనిఖీ చేశారు. ఆమె తాసీల్దార్ అమీన్‌సింగ్, ఏఓ వికాస్‌పాటిల్ ఉన్నారు.

కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నూతనకల్, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ జెండాను, నాయకులను, కార్యకర్తలను కాపాడే బాధ్యత తనదేనని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో కష్టపడి పని చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య, నాయకులు బత్తుల సాయిల్‌గౌడ్, బత్తుల విజయ్‌కుమార్, చూడి లింగారెడ్డి, బత్తుల విద్యాసాగర్, వీరమల్ల యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, వెంకన్న, లింగమల్లయ్య, బుచ్చయ్య, రాంరెడ్డి, పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

మద్దిరాల : బీఆర్ఎస్‌కు కొట్లాటలు కొత్తేమీ కాదని నిలబడి కలబడుదామని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నట్లు సమాచారం అందుతున్నది. ఎవరూ అధైర్య పడొద్దు అండగా ఉంటానని తెలిపారు. లీగల్‌గా ఎదుర్కొవడానికి పార్టీ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన వాళ్లే పార్టీ మారుతున్నట్లు దుయ్యబట్టారు. పోయేవారిని పోనివ్వండి ఉన్నవారే కష్టపడి పనిచేస్తే నాయకులు అయ్యి రాజకీయ అవకాశాలను పార్టీ కల్పిస్తుందని తెలిపారు. ఈ నెల 3న మండల కేంద్రంలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎస్ఏ రజాక్, వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సూరినేని నర్సింహారావు, జిల్లా నాయకులు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల వెంకన్న, వడ్డాణం మధుసూదన్, లావుడ్య వెంకన్న, దామెర్ల వెంకన్న, నాగెల్లి శ్రవణ్‌కుమార్, మల్లు కలింగారెడ్డి, బొబ్బిలి ఉప్పలయ్య, బద్దం సంజీవరెడ్డి, అక్కిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, భూక్య వీరన్న పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

నూతనకల్, ఏప్రిల్ 30 : ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 25 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 8 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీడీఓ శోభారాణి

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

● మాజీ ఎంపీడీఓ శోభారాణి

నాగారం, ఏప్రిల్ 30 : అంకితభావంతో పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ఎంపీడీఓ గాలి శోభారాణి అన్నారు. నాగారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పదవీ విరమణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆమెను ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ దారా శ్రీనివాస్, రవికుమార్, మిషన్ భగీరథ ఏఈ చందన, ఏపీఎం శోభారాణి పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనతో వార్ వన్ సైడ్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట మున్సిపాలిటీ, సోలిపేటలో ఇంటింటి ప్రచారం
- కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని విన్నపం

సూర్యాపేట, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)/సూర్యాపేట రూరల్, : జిల్లాలో ఆరు రోజుల కేసీఆర్ పర్యటనతో లోక్‌సభ ఎన్నికల్లో వార్ వన్ సైడే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం సూర్యాపేట రూరల్ మండలం సోలిపేట, సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పలు వార్డుల్లో గడప గడపకూ వెళ్లి ప్రచారం నిర్వహించారు. జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళలు హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ హవా మళ్లీ మొదలైందని, కేసీఆర్ వస్తేనే తమకు శ్రీరామ రక్ష అని ప్రజలు నమ్ముతున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు కాంగ్రెస్ పాలనలో కక్షపూరిత వైఖరి, నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యంతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలే తమకు వివరిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరూ తోడు దొంగలేనని, వారి సిద్ధాంతాలను, రాద్ధాంతాలను ప్రజలు గమనించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నట్లు వెల్లడించారు. బీజేపీ ముస్లిం రిజర్వేషన్ల రద్దు పేరుతో మొత్తం రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీ వ్యాపారస్తుల పార్టీ అన్న ఆయన ప్రజలను మరింత బీదవాళ్లను చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ పని చేస్తున్నట్లు విమర్శించారు. ప్రజల్లో సెంటిమెంట్ రగిల్చి పబ్బం గడుపుకునేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజలను ఆకలితో ఉంచాలనే దుర్మార్గమైన సిద్ధాంతం కోసం బీజేపీ పని చేస్తున్నదని మండిపడ్డారు. నోటీసుల డ్రామాతో ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి లోపాయికారి ఒప్పందం బయటపడిందన్నారు. బీజేపీకి రేవంత్‌తో ఒప్పందం లేకుంటే కవితను అరెస్ట్ చేసినట్లు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మీడియాలో ప్రచారం కోసం ప్రజలను మోసగించేందుకే రేవంత్ నోటీసుల డ్రామా అని దుయ్యబట్టారు. మారిన పరిస్థితుల్లో రాష్ట్రంలోని అన్ని ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకోనున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర పరిస్థితుల్లో మార్పు తథ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడి భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, నాయకులు గోగిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవి, పరమేశ్ పాల్గొన్నారు.



సూర్యాపేట రూరల్ : సోలిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

కాంగ్రెస్ హామీలన్నీ బూటకమే

ఆత్మకూర్.ఎస్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ బూటకమేనని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మర్ల చంద్రారెడ్డి, మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు అన్నారు. మండల పరిధిలోని మక్తా కొత్తగూడెం గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకానీ హామీలతో ప్రజలను మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల రాజేంద్రప్రసాద్, ముద్దం కృష్ణారెడ్డి, మిర్యాల వెంకట్‌రెడ్డి, కనకసగాని బ్రహ్మం, గునగంటి భిక్షం పాల్గొన్నారు.

ఇంటి పార్టీని ఆదరించాలి..

పెన్‌పహాడ్ : పొరుగు పార్టీలు, అవినీతి పార్టీలైనా కాంగ్రెస్, బీజేపీలను సాగనంపి నిత్యం ప్రజల శ్రేయస్సు కోరే ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను ఆదరించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం, పార్టీ మండలాధ్యక్షుడు దొంగరి యుగేంధర్ ప్రజలను కోరారు. మండల పరిధిలోని అనాజీపురం, జల్మాలకుంటతండా, దోసపహాడ్, గూడెపుకుంటతండాలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఇస్లావత్ రాంచంద్రానాయక్, నాయకులు తూముల ఇంద్రసేనారావు, వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, పొదిల నాగార్జున, జూలకంటి వెంకట్‌రెడ్డి, ఎగ్గడి మురళి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, కొండా జానకిరాములు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్ : మక్తా కొత్తగూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పెన్‌పహాడ్ : అనాజీపురంలో కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ భిక్షం, బీఆర్ఎస్ నాయకులు

ఉద్యమకారులను మోసం చేసిన కాంగ్రెస్

● మలిదశ ఉద్యమకారుడు మండవ నాగేశ్వర్‌రావు



కీతవారిగూడెంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

గరిడేపల్లి, ఏప్రిల్ 30 : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మలిదశ ఉద్యమకారుడు మండవ నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో మంగళవారం జరిగిన మలిదశ ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికల సమయంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని, అమరుల కుటుంబాలకు పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం అని చెప్పి ఇప్పుడు మాట ఎత్తకపోవడం దారుణమన్నారు. సమావేశంలో మలిదశ ఉద్యమకారులు పిడమర్తి అంజి, పోలంపల్లి ఆనంద్‌బాబు, అమరగాని లక్ష్మణ్, మధు, నాగేంద్రచారి పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు

నేరేడుచర్ల : మే డేను జయప్రదం చేయాలని కార్మికులను కోరుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు

నేరేడుచర్ల, ఏప్రిల్ 30 : కార్మికుల దినోత్సవమైన మే డేను వివిధ సంఘాల కార్మికులు కలిసిమెలిసి జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కాపాడుకోవాలని, కార్మిక హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నందున కార్మికులు మేల్కొని కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రాంమూర్తి, పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేశ్, రైతు సంఘం జిల్లా నాయకుడు పాతూరు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నూతనకల్, ఏప్రిల్ 30 : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య కోరారు. మండల పరిధిలోని యడవెల్లి గ్రామంలో మే డేను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులు చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను నేడు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తుందని దుయ్యబట్టారు. కనీస వేతన చట్టాన్ని సవరణ చేయకుండా కార్మికులను శ్రమ దోపిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మోతె : మే డేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. మండల పరిధిలోని రావిపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 30 : మండల పరిధిలోని ఎండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో హెచ్ఎం కె.రాఘవరెడ్డి, పూర్వ విద్యార్థులు ఉయ్యాల రవిమూర్తి, వెంకన్న, పంతుల, నరసింహ, వెంకట్, జానీమియా, శోభ, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.



ఎండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

జిల్లా గ్రంథాలయానికి ఫ్రిడ్జ్ అందజేత

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 30 : జిల్లా గ్రంథాలయానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికాప్రకాశ్ తన మామ, ప్రముఖ వ్యాపారవేత్త రామస్వామి వర్ధంతి సందర్భంగా మంగళవారం కూల్ అండ్ హాట్ వాటర్ ఫ్రిడ్జ్‌ను బహూకరించారు. అలాగే కర్నల్ సంతోష్‌బాబు చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గండూరి ప్రకాశ్, రామస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

అర్వపల్లి, ఏప్రిల్ 30 : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ శివారులో ఉన్న సార్ల శ్రీనివాస్ అనే రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. 200 మోపుల గడ్డివాము, 150 కిలోల సుట్ట పైపు, 25 తెల్ల పైపులు తగులబడ్డాయి. అలాగే పక్కనే ఉన్న పశువుల కొట్టం పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

గడ్డిపల్లి కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలు

గడ్డిపల్లిలో కాటన్ షెడ్డర్ పనిచేసే విధానాన్ని వివరిస్తున్న కేవీకే ఇన్‌చార్జి పీసీ నరేశ్

గరిడేపల్లి, ఏప్రిల్ 30 : దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ఇన్‌చార్జి పీసీ దొంగరి నరేశ్ మాట్లాడుతూ.. వ్యవసాయం రంగంలో వస్తున్న నూతన విధానాలను ఎప్పటికప్పుడూ రైతులకు వివరించేందుకు కేవీకేలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గడ్డిపల్లి కేవీకేలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులను క్షేత్ర సందర్శనకు తీసుకువెళ్లి కాటన్ షెడ్డర్ పనిచేసే విధానం గురించి ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్.నరేశ్, ఎ.కిరణ్, డి.ఆదర్శ్, రైతులు పాల్గొన్నారు.

బాల విజ్ఞాన మేళ పోస్టర్ ఆవిష్కరణ

కోదాడ రూరల్, ఏప్రిల్ 30 : జే.వీ.వీ సూర్యాపేట జిల్లా కమిటీ అధ్వర్యంలో కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 11వరకు బాల బాలికలకు నిర్వహించే సమ్మర్ క్యాంప్ (బాల విజ్ఞాన మేళ) పోస్టర్‌ను మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ సాయాగౌడ్, కోదాడ డివిజన్ అడ్మిస్ట్రేటీవ్ అధికారి దేవకరుణ ఆవిష్కరించారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు పాఠశాల స్థాయి బాల, బాలికలకు గణితం, సైన్స్, స్టోరీస్, క్రాఫ్ట్, డ్రాయింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చందా శ్రీను, ఎస్‌కె జాఫర్, డీఎన్ స్వామి, బడుగుల సైదులు, ఆర్.రామనర్సయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● బీఆర్ఎస్ నాయకుడు సత్తయ్యగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న కటికం సత్తయ్యగౌడ్

మునగాల, ఏప్రిల్ 30 : అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు కటికం సత్తయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉన్నదని, తెలంగాణలో గతంలో అమలైన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే కోదాడ పట్టణంలో ఈ నెల 4న నిర్వహించే రోడ్డు షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ నాయకుడు సుంకర అజయ్‌కుమార్, మండలాధ్యక్షుడు తొగరు రమేశ్, మాజీ జడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు, సహకార సంఘాల చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, మండల ప్రధాన కార్యదర్శి ఎలక వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశ్రీ కి నివాళి

శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 30 : సమాజంలో దౌర్జన్యాలను ఆనాడే ఘాటుగా విమర్శించిన అభ్యుదయ కవి శ్రీశ్రీ అని పలువురు కవులు, రచయితలు అన్నారు. ఆయన రచనలు నేటికి ఆదర్శనీయమని కొనియాడారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం కార్యాలయంలో భానుపురి సాహితీ వేదిక, శ్రీశ్రీ కళావేదిక అధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. వచన కవిత్వంలో తిరుగులేని మహాకవిగా శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని మనకందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, భానుపురి సాహితీ వేదిక గౌరవ సలహాదారులు హమీద్‌ఖాన్, చిర్ర శ్రీనాథ్, మారోజు ద్రోణాచారి, కాసోజు పాండు, కొసనోజు సైదాచారి పాల్గొన్నారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి

● పీడీఎస్‌యు, పీవైఎల్ నాయకులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 30 : సమాజంలో మత విద్వేశాలను రెచ్చగొడుతున్న బీజేపీని ఓడించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లగొండ నాగయ్య, డి.రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు, యువకుల మెదడులో మతత్వాన్ని, కులతత్వాన్ని పెంచి పోషించడానికి అనేక కుట్రలు పన్నుతుందన్నారు. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానం ముందుకు తీసుకొచ్చి విద్యా కాషాయీకరణను పెంచి పోషించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, యువకులు మేలుకుని మతోన్మాద బీజేపీని ఓడించాలని కోరారు. సమావేశంలో నాయకులు లింగయ్య, నాగరాజు, ఉమేశ్, శ్రీను పాల్గొన్నారు.

ఓటుతో బుద్ధి చెప్పాలి

హుజూర్‌నగర్ : ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రధాని మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా నట్టేట ముంచిదని పేర్కొన్నారు.

వృద్ధాప్యాన్ని సంతోషంగా గడుపాలి

● పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య

విశ్రాంత ఉద్యోగులను సన్మానించిన సంఘం నాయకులు

కోదాడ, ఏప్రిల్ 30 : విశ్రాంత ఉద్యోగులు సమస్యలకు దూరంగా ఉంటూ వృద్ధాప్యాన్ని సంతోషంగా గడుపాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావేళ్ల సీతారామయ్య అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఏప్రిల్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల సామూహిక పుట్టినరోజు వేడుకలను కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు మల్లెంపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.